క్లుప్తంగా

మెజిస్ట్రేట్‌కు సన్మానం



మెజిస్ట్రేట్ వీరనాగ వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: ఆదోని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తూ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై కృష్ణాజిల్లా కైకలూరు కోర్టుకు వెళ్తున్న వీరనాగ వెంకటలక్ష్మిని గురువారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు అనితాబాయి ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. మెజిస్ట్రేట్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఆదోని అసోసియేషన్ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని అభినందించారు. విధుల పట్ల ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు అంజినప్ప, లావణ్య, సవితారాణి, సీనియర్ న్యాయవాదులు మన్సూర్ అహమ్మద్, గిరిధర్, బద్రీనాథ్, శివ కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్నూలు నగరానికి చెందిన నాగప్రదీప్, కిరణ్మయి ఆచారి, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 ను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికంగా తరలివచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు నిండిపోయాయి. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బదినేహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపిందని ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. గురువారం విద్యార్థిని షబానాబేగంను ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలోని బంగారుపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చూపిందని చెప్పారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



ఏరిగేరిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కౌతాళం: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని జైభీమ్ వ్యవస్థాపకుడు అవతారం, ఎరిగేరి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ ఆటపాట అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అవతారం తెలిపారు. ఇందులో భాగంగానే ఏరిగేరి జెడ్పీ పాఠశాలలో క్రికెట్ పోటీలు, బదినేహాల్ పాఠశాలలో ఖోఖో పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పథకాలతో పేదల కష్టాలు దూరం





26వ వార్డులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు, జెండావిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

ఆదోనిటౌన్: సంక్షేమ పథకాలతో పేదల కష్టాలు తీర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 26వ వార్డు సచివాలయం-2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏదేని సాంకేతిక కారణాల వల్ల నవరత్నాల్లో భాగంగా అర్హులై ఉండి పథకాలు అందకపోయి ఉంటే సచివాలయల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వలంటీర్లు అలాంటి వారిని గుర్తించి పథకాలు అందేలా చేయాలని సూచించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కౌన్సిలర్ సైదున్‌బీ, హాజీబాషా, వార్డు ఇన్‌చార్జ్ నూర్‌బాషా, నాయకులు రహీం, మహబూబ్, భాయ్ పాల్గొన్నారు.

మంత్రాలయం : మండలంలోని 52-బసాపురం గ్రామంలో ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. గురువారం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో రూ.16.96 కోట్లతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేశామని వీటిని వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ రాఘవ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న విజయాన్ని ఆపలేరు

కోసిగి: రాష్ట్రంలో ప్రతిపక్షాలన్నీ ఏకమైనా ప్రజల అభిమానం చూరగొన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేరని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దుద్ది సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా దుద్ది, కొల్మాన్‌పేట గ్రామ నాయకులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా దుద్ది ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం వలంటీర్లు బుక్‌లెట్స్ అందజేశారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, నాయకులు నాడుగేని నాగరాజు, కోసిగయ్య, దుద్ది నాగేష్, రామలింగ, కోల్మాన్ పేట సర్పంచ్ జయరామ్, హనుమంతు పాల్గొన్నారు.



దుద్దిలో వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కౌతాళం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని బంటకుంట, సుళేకేరి సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, లక్ష్మి, ఎంపీడీఓ సుబ్బారాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని సుళేకేరి గ్రామ సచివాలయంలో గురువారం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి ఎందుకు కావాలో ప్రజలకు వివరించాలని తెలిపారు. సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆదోనిఅర్బన్: స్థానిక మస్తాన్‌వలీ దర్గా షరీఫ్‌లో గురువారం ప్రభుత్వ యునానీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత యునానీ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు షాకీరాబేగం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కౌతాళం: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తిప్పేస్వామి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కస్తూర్బా, నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అఘాయిత్యాలు, హింసను నిరోధించేందుకు మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం వెలుగు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్‌లో మానవహారం చేపట్టారు. కేజీబీవీ ప్రత్యేకఅధికారిణి పుష్పలత పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ ఎన్నిక

ఆదోని సెంట్రల్: ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ 6వ పట్టణ మహాసభల్లో సమస్యలపై పోరాడే పటిష్టమైన నాయకత్వం కోసం 17 మంది సభ్యులతో ఎన్నిక చేపట్టినట్లు చెప్పారు.పట్టణ అధ్యక్షుడిగా గౌస్, పట్టణ కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా దినేష్, పవన్, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా శశిధర్, గణేష్, సూరి సభ్యులుగా 10 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

రైళ్లను పునరుద్ధరించాలి



స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కోసిగి: కోసిగి మీదుగా వెళ్తున్న పలు రైళ్లు రద్దయ్యాయని, వాటిని పునరుద్ధరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, వీరేష్ కోరారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గుల్బర్గా నుంచి కోసిగి మీదుగా గుంతకల్లుకు, గుంతకల్లు నుంచి కోసిగి మీదుగా గుల్బర్గాకు వెళ్లే ప్యాసింజర్, విజయవాడ వరకు రైలును కొనసాగించేలా చూడాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, రామకృష్ణ, రామాంజనేయులు, గోపాల్, చిన్నారెడ్డి, దుద్ది రామయ్య, కర్రెప్ప, మహేష్ పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణను ఆపాలి

ఆదోనిరూరల్: రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని, రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.తిప్పన్న డిమాండ్ చేశారు. గురువారం ఆదోని రైల్వేస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేలో యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండే వ్యవస్థను ప్రైవేటీకరించడం వల్ల యువత ఉపాధి కోల్పోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే.. గతంలో రాయచూరు నుంచి కాకినాడ మధ్య నడుస్తున్న రైలు, గుల్బర్గా ప్యాసింజర్‌ను రద్దు చేశారని వాటిని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు ఇక్బాల్, రామప్ప, బాషా, హనుమంతు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రోగుల చికిత్సలో కేస్‌షీటే ప్రామాణికం

కర్నూలు(హాస్పిటల్): రోగులకు అందించే చికిత్సలో కేస్‌షీటే ప్రామాణికమని, రోగికి ఇచ్చిన చికిత్సకు సంబంధించి ప్రతి విషయాన్ని అందులో రాయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బందితో ఆయన ఓరియంటేషన్ ప్రొగ్రామ్ నిర్వహించారు. రోగులకు సంబంధించిన ఓపీ, ఐపీ విభాగాల్లో ఉంటే కేస్‌షీట్, ఓపీ పత్రాలు ఎలా భర్తీ చేయాలి, కేస్‌షీట్‌లో రోగికి సంబంధించిన వివరాలపై రెండు రోజుల పాటు ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా వివరిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో ఈ-హాస్పిటల్ అప్‌లోడింగ్ అమలు ప్రక్రియ కొనసాగుతోందని, ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని నర్సింగ్ సిబ్బందిని ఆదేశించారు. త్వరలో పేపర్‌లెస్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు సిద్ధం కావాలని చెప్పారు. రోగులకు సంబంధించిన ఈ-హాస్పిటల్, కేస్‌షీట్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కేస్‌షీట్‌లో ఎలాంటి తప్పులు లేకుండా ఆధార్ అనుసంధానంగా చిరునామా, పేరు తదితర వివరాలు తప్పులు లేకుండా రాయాలని సూచించారు. డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివ బాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, గ్రేడ్-2 నాగమణి, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయం

ఆదోనిటౌన్: పట్టణంలోని పాండురంగస్వామి గుడి ఏరియా, చౌకిమఠం ప్రదేశాల్లో నీటి సమస్య తలెత్తకుండా బోర్లు వేయిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం బోర్లకు అనువైన స్థలాలను ఎంఈ రాధాకృష్ణ, డీఈ, ఏఈలతో కలిసి పరిశీలించారు. వార్డుల్లో ప్రజల నీటి అవసరం మేరకు బోర్లుఉ వేయిస్తామని చెప్పారు. బోరుకు మినీ వాటర్ ట్యాంకును అమర్చి నీటిని సరఫరా చేస్తామన్నారు.



పాండురంగస్వామి ఆలయ సమీపంలో మినీ వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

సమస్యలను పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం'



వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: గ్రామాల్లో ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. గురువారం మండలంలోని బదినేహాల్ గ్రామంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గురువారం గ్రామాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకుని రావాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ నరసప్ప ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, మైనర్ ఇరిగేషన్ ఏఈ చెన్నయ్య, ఆర్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్‌ను పూర్తి చేయండి

మద్దికెర: మారుమూల ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని, సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో భవన నిర్మాణం పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆస్పరి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని గురువారం ఆస్పరి ఏఓ కార్యాలయంలో ఆలూరు ఏడీఏ సునీతకు సీపీఐ నాయకులు విరుపాక్షి, క్రిష్ణమూర్తి, ఉరుకుందప్ప, లక్ష్మన్న వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, వేరుశనగ పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు పెట్టుబడులు కూడా దక్కలేదన్నారు. రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.50 వేలు ఇవ్వడమే కాకుండా బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరారు.

3 నుంచి వ్యవసాయ సదస్సు

ఎమ్మిగనూరురూరల్: అగ్రిటెక్ వ్యవసాయ సదస్సు-2023 వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ గురువారం తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణం, లాఫారంలో ఈ సదస్సు జరుగుతుందని, వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, నూతన వంగడాలతో పాటు వివిధ పంటల గురించి ప్రదర్శన ఉంటుందన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

తుగ్గలి: తమ భూములను ఇతరుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని గురువారం బొల్లవానిపల్లి రైతులు తహసీల్దార్ రవికి విన్నవించారు. 257 సర్వే నంబరులో 2016 వరకు తమపేరిట 3.85 ఎకరాల భూమి ఉందని కదిరమ్మ, లాలెప్ప తెలిపారు. 2017లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమిలోని 1.30 ఎకరాలను తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని బాధిత రైతులు తమ డాక్యుమెంట్లను తహసీల్దార్‌కు చూపించి న్యాయం చేయాలని కోరారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు రైతులు రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి 442 సర్వే నంబరులో 2017 వరకు తమ పేరిట ఉన్న 1.18 ఎకరాల భూమి మిగులు భూమిగా చూపిస్తున్నారని విచారణ చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ఆదర్శవంతమైన పాలనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బల్లేకల్ గ్రామంలో రెండో రోజూ గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న.. తానున్నానని ప్రజలకు భరోసా కల్పించి ఎన్నికల్లో గెలిచిన ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలుపుకున్న ఏకైక నాయకుడిగా చరిత్ర సృష్టించారని కొనియాడారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.17,85,40,000 నేరుగా ఖాతాల్లో జమ చేశారన్నారు. సచివాలయ నిధులు ద్వారా రూ.20లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు అంచనాలు వేయించామన్నారు. గ్రామంలో 60 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. కొత్త విద్యుత్ స్తంభాలు 30, వీధి దీపాలు మంజూరు చేయించామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి వేసేందుకు రూ.10 కోట్లతో జలజీవన్ పథకం ద్వారా పైపులైన్ వేసేందుకు టెండర్ వేశారని వివరించారు. జెడ్పీ స్కూల్ రూ.1.20 కోట్లతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే అదనపు గదుల కోసం రూ.5 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపీడీఓ గీతావాణి, ఏపీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, సర్పంచ్ లోకేష్, ఎంపీటీసీ దేవికమ్మ, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, నాయకులు రామలింగేశ్వరయాదవ్, కల్పవల్లి, గోపాల్‌రెడ్డి, రంగస్వామి, బసవరాజు, ఈరన్న, ప్రహ్లాద్, అల్లయ్య, శివయ్య, మల్లయ్య, నరసింహులు, సీతారామిరెడ్డి, ఉరుకుందు, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఆదోనిరూరల్: ఉపాధి హామీ కూలీలకు కరువు సహాయక చర్యల్లో భాగంగా తక్షణమే రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, చేసిన పనులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. గురువారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువుతో నవంబర్ మొదటి నుంచే వలసలు ప్రారంభమయ్యాయని, చాలామంది వంద రోజులు పూర్తి చేసుకున్న వారు ఇప్పటికీ ఇళ్ల దగ్గరే ఉన్నారని, మరో ఐదు నెలలు గడవాలంటే మరో వంద రోజులు పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

భర్తను హతమార్చిన భార్య



మృతి చెందిన కోసిగి నారాయణ

ఆదోనిరూరల్: ప్రతి నెల వస్తున్న పింఛన్ ఇవ్వలేదని భర్తను హతమార్చిన ఘటన మండలంలోని కపటి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నారాయణ(70) నెలనెలా వస్తున్న పింఛన్ డబ్బులు ఇవ్వకుండా మొండికేయడంతో కోపానికి గురైన భార్య నీలమ్మ అన్నం పెట్టకుండా గొడవకు దిగింది. క్షణికావేశంలో తాడుతో గొంతుకు బిగించి హతమార్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హత్య వెనక కుమారుడు శ్రీరాములు హస్తం కూడా ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



లద్దు సోమేష్ (ఫైల్)

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో లద్దు సోమేష్ (34) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. తాలుకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపిన వివరాల మేరకు.. లద్దు సోమేష్‌కు 1.50 ఎకరాల పొలం ఉంది. మరో పది ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల నుంచి వరుసగా కరువుతో పంటలు పండలేదు. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులు తీవ్రమయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతూ గురువారం పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మునేశ్వరితో పాటు కుమారుడు విష్ణు, కుమార్తె తులసి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయండి



నందవరంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి నాసరరెడ్డి

నందవరం: ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి నాసరరెడ్డి ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నిత్యానందరాజు ఆధ్వర్యంలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 5వ తేదీలోపు సవరణలు ఫారం-6, 7, 8లకు సంబంధించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు ఓటు నమోదు, జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించాలన్నారు. డెత్, మైగ్రేషన్ ఓటర్లకు సంబంధించి పక్కా ఆధారాలు తొలగించిన తర్వాతే ఓట్లను తొలగించాలన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, ర్యాంపు తదితర సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎన్నికల సూపర్‌వైజర్లు ఎంఈఓ-2 రఘునాథ్, ఎన్నికల డీటీ గురురాజరావు, డీటీ రఘువీరా, ఆర్‌ఐ జెర్మియా, ఏఓ కృష్ణమూర్తి, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల సీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరురూరల్: స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సు, పిల్లలను తరలించే ఆటోలో కెపాసిటీకి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యజమానులు తమ బస్సులకు సీనియర్ డ్రైవర్లను నియమించుకోవాలని, నిబంధనలు పాటించని బస్సులు, ఆటోలను సీజ్ చేసి ఆర్టీఓకు పంపిస్తామని చెప్పారు. అతివేగం కాకుండా నిదానంగా వెళ్లాలని, యూ టర్న్ తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టౌన్ ఎస్‌ఐ రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్‌ఐ సురేష్‌బాబు, ఏఎస్‌ఐలు కృష్ణయ్య, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

గోనెగండ్ల: స్వర్గీయ పెద్ద రంగస్వామి స్మారకంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఆంధ్ర కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుబేర్ నాయుడు, జాకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో వారు మాట్లాడుతూ ఈనెల 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో 13 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఉన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన వెంకన్న (55) అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా చుట్టుపక్కల వారు గమనించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా పరదేశప్ప తాత ఆరాధనోత్సవాలు

ఆస్పరి: మండలంలోని అట్టేకల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత 13వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పరదేవశప్ప తాత సమాధికి గంగపూజ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పరదేశప్ప తాత పల్లకీని మేళతాళాలతో భక్తులు ఊరేగించారు. తాతను భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పరదేశప్ప తాతను దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి మండలంలోని బెల్డోణ గ్రామంలోలో విశేష స్పందన లభించింది. గురువారం బెల్డోణ గ్రామ సచివాలయంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించిన వివిధ గ్రామాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చెప్పారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న, ఏఈఓ రమాదేవి, పంచాయితీ కార్యదర్శి రామాంజనేయులు సర్పంచ్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.